# ప్రతిష్ఠానం

(ఏకాంకనాటిక.)

శ్రీ కపిల కాశీపతిగారు.

స్థలం : ప్రతిష్ఠానపురం సమీపంలో గోదావరీ తీరం.

కాలం : యుగసంధి : పద్దెనిమిదివొందల అరవైయ్యారు సం వత్సరాల క్రితం. వసంత ఋతువు.

పాత్రలు : విక్రమాదిత్యుడు
మంత్రి
క్షంపాంకుడు : సిద్ధాంతి
చాటించేవాడు : ఛండాలుడు
బ్రాహ్మణుడు
శాలివాహనుడు : బాలుడు
గోదావరి : నదీకన్య.

[రంగం : ప్రతిష్ఠానపురం దగ్గిర గోదావరీ తీరం. కుమ్మరి బాలుడు శాలివాహనుడు సారెతో ఆడుకుంటూ, మట్టిబొమ్మలు చేస్తూవుంటాడు. చాటించేవాడు డప్పుతో ప్రవేశిస్తాడు. దూరంగావున్న మామిడిచెట్టు మీంచి కోకిల కూస్తుంది.]

చాటించేవాడు : (డప్పు వాయిస్తాడు) శ్రీ శ్రీ శ్రీ దేవరాజ శ్రీ పరమభాగవత మహారాజాధిరాజ రూపకీర్తి నరేంద్ర చంద్ర సార్వభౌమ సామ్రాట్ అజిత విక్రమగుప్తకులస్య విక్రమాదిత్య మహారాజులుంగారు బంధుమిత్రసైన్య పరివారంగా, గోదావరీ తీరాన విడిసివున్నారు గనకా, మూడురోజుల్దాకా ఉదయం సాయంకాలం వేట జేస్తారు గనకా, ఎవరి పశువుల్నివారూ, ఎవరి పెంపుడు జంతువుల్నివారూ, జాగర్త పెట్టుకోవలసిందో హోయ్! (మళ్లీ డప్పు వాయిస్తాడు).

శాలివాహనుడు : గిర్రున తిరిగే చక్రం
గిరగిర తిరిగే చక్రం
అరవయ్యారుల చక్రం
ప్రథమది ప్రభవా
పక్కది విభవా
గిర్రున తిరిగేచక్రం
అరవయ్యారుల చక్రం
శాలీవాహన చక్రం!

చాటించేవాడు : (మళ్లీ డప్పువాయిస్తాడు).

శాలి : ఏయ్! డప్పూ!

చాటి: శ్రీ శ్రీ శ్రీ.

శాలి : ఏయ్! నిన్నే, పిలిస్తే పలకవేం?

చాటి: ఏం. ఎందుకు పిల్లోడా?

శాలి : ఆడప్పు నాకిస్తావ్?

చాటి: ఏం జేస్తావ్?

శాలి : చాటిస్తా.

చాటి: ఏమని?

శాలి : శ్రీ శ్రీ శ్రీ శాలివాహన చక్రవర్తిగారూ, ఇక్కడే చతురంగ బలాల్ని తరిఫీయదు చేస్తున్నారు గనకా, గోదావరిగట్టుకే ఎవరూ రావడానికి వీల్లేదోహోయ్!

చాటి : ఎవడాచక్రవర్తి?

శాలి : నేనే.

చాటి : వహవ్వా! వహవ్వా! బలే దొడ్డ చక్రవర్తివి. దార్లోలే మహారాజుగారు షికారుకొచ్చే వేళైంది.

శాలి : రావడానికి వీల్లేదనేచెప్పేది. తెలియడంలేదు. మీ మహారాజుకంటె, ఈ చక్రవర్తి గొప్పవాడు; తెలివైనవాడు; బలవంతుడు.

చాటి : పిట్టకొంచెంకూత ఘనంగావుందే!

శాలి : నువ్వా నేనాకూసేది? నా సైన్యాలు చూస్తే మీ మహారాజు భయపడి, పరిగెత్తి పారిపోవాలి.

చాటి : ఎక్కడా కనబడవేం, అంత బలమైన సైన్యాలు? నీచుట్టువున్న కుండ పెంకులేనా?

శాలి : కుండపెంకులా, చూసుకో! సారె తిప్పేసరికి ఎల్లా వొస్తాయో. కూచో చూబిస్తా. భయపడకేం నిన్నేం చెయ్యవులే!

చాటి : ఎఱ్ఱోడ, ఎఱ్ఱోడాని! కుమ్మరోళ్లకుఱ్ఱోడవైనా కూతలు పెద్దయే.

శాలి : కుమ్మరాళ్లు తీసిపోయారా?

చాటి: సరే, నీతో వాదనేసుకూర్చుంటే పొద్దుపోద్ది. పొద్దాటాల్నించి అరిసరిసి గొంతుకారిపోయింది. ఏట్లో



http://www.maganti.org/

కాసిన్ని మంచీలు తాగొస్తా. నాడప్పు చూస్తోండు (డప్పుకింద పడేసి, ఏట్లోకి దిగుతాడు).

అమ్మయ్య కూస్తంత దాగం తగ్గింది. గోదారమ్మ నీలు తియ్యగుంటయి. చల్లని తల్లి.

శాలి : ఆవిడేమా అమ్మ!

చాటిం: అందుక నేనా, రేవునిండాకుండ పెంకులు పోగే శావ్ ?

శాలి : అరే! మళ్లీ పెంకులంటావ్. నా పరివారం అంటే తెలియడం లేదూ.

చాటిం: ఆ మట్టిబొమ్మలన్నీనా, నీ సైన్యాలు. బలే చక్రవర్తివి.

శాలి : చూసుకో, ఎన్ని వేలమంది సైనికులున్నారో. ఏనుగులు, గుర్రాలు, రథాలు కావలిసినన్ని ఏట్లో ఇంకావున్నాయి.

చాటిం: ఇవి చేతులడేట్లు చెయ్యడమెందుకు, మళ్లీ ఏట్లో పారెయ్యడమెందుకు.

శాలి : ఏరు కాదు. గోదావరి మా అమ్మంటే వినవేం. ఈ సైన్యాలన్నీ అక్కడ దాక్కుంటాయి. నా శత్రువులొస్తే, పైకొచ్చి యుద్ధంచేస్తాయి. చూసుకో ఈ గుర్రం ఎంత బాగుందో. దీని మీదే నేనెక్కి యుద్ధానికెడతాను. (పెద్ద మట్టిగుర్రం చూబిస్తాడు)

చాటిం : వీటికన్నింటికేనా, నువ్వు చక్రవర్తివి. కావలసినంత మట్టి, నువ్వుచెయ్యగలిగి నన్నిబొమ్మలు. నీ పనే బాగుందినాయనా, అదుగో మహారాజుగారిల్లాగే షికారొస్తున్నారు. నేను పోవాలి బాబోయ్!

(విక్రమాదిత్యుడూ మంత్రీ ప్రవేశిస్తారు)

విక్ర : ఆహా! గోదావరి ఎంత సుందరమైన నది. అందుకనే ఆదికవి వాల్మీకికూడా "యం గోదావరీ రమ్యాన్ చక్రవాకో విశోభితా" అనిపించాడు, శ్రీరామచంద్రమూర్తిచేత.

మంత్రి : గోదావరీ, దక్షిణగంగ.

విక్ర : అటువంటి పుణ్యస్రవంతి గోదావరీ దేవిదృశ్యంకూడా నాకు విశ్రాంతీ, మనశ్శాంతీ చేకూర్చడం లేదు ఈ వేళ. మంత్రీ మహాసిద్ధాంతులు, క్షుంపాంకులవారింకా మన్ని అందుకోలేదు.

మంత్రి : కబురంపించాను, మహారాజా, రథంమీద క్షణంలో దయచేస్తారు.

శాలి : గిరగిర తిరిగే చక్రం
గిర్రున తిరిగే చక్రం
ఏనుగులియ్యవె చక్రం
గుర్రాలియ్యవె చక్రం
ఏనుగులెక్కే మనుషుల్నీ
గుర్రాలెక్కే రౌతుల్నీ
వేనకువేలు వేగంగా
గిరగిర తిరిగే చక్రం
శాలీవాహన చక్రం.

విక్ర : ఆహా పిల్లవాడుచూడు ఎంత ఖులాసాగా ఆడుకుంటున్నాడోయీ.

మంత్రి : బాల్యాన్ని మించిన వయస్సుందా, మహారాజా.

విక్ర : ఒక్కడే చూశావా, మట్టిబొమ్మల్తో ఆడుకుంటున్నాడు.

మంత్రి : సారెతిప్పుతూ స్వరూపాలుచేస్తున్నాడు.

విక్ర : వాడు చేసేవి కుండలుకాదు, ఏనుగులూ, గుర్రాలూ, మనుష్యులూ, తయారుచేస్తున్నాడు. సృష్టికర్తననుకుంటున్నాడు గావును.

మంత్రి : చిన్నప్పటి భావనాశక్తి, తన్మయత్వం పెద్దతనంలో మళ్లీ రావుగదా.

విక్ర : ఎన్ని రాజ్యాలేలి, ఎంత అధికారంవుంటే నేమి మనశ్శాంతి లేకపోయిన తర్వాత, ఆ కుర్రవాణ్ణి సింహాసనం మీద కూచోబెడితే ఆ సంతోషంవుంటుందా.

(రథంవొస్తున్న చప్పుడవుతుంది)

మంత్రి: మహారాజా, మహాసిద్ధాంతులు క్షుంపాంకులవారు విజయంచేస్తూన్నారు.

విక్ర : ఆచార్యులవారికి నమస్కారం, దయచెయ్యండి.

క్షుంపా : విజయీభవ!

విక్ర : మహానుభావా, మనంజయించవలసిన వీరులింకావున్నారా ?

మంత్రి: సూర్యుడికి దీపమన్నట్టు వీరవిక్రమాదిత్యులవారికి విజయాశీర్వచనం చాలదు మహాత్మా!



http://www.maganti.org/

క్షుంపా : అవతారమూర్తి పరశురాముడికి తప్పలేదు. ఇరవై యొక్కసార్లు విజయ యాత్రచేసి, సర్వక్షత్రియ సర్వ నాశనంచేసి, పితృపాదులికిరుధిర తర్పణంవొదిలిన, ఆ విష్ణుమూర్తికి, శత్రుశేషంలేకుండాపోలేదు. తనే, ఆ క్షత్రియం రూపంలో వొచ్చి తన పూర్వావతారాన్ని ఉపసంహారించుకున్నాడు. అదే అవతార తత్వం సృష్టి స్థితిలయాలకి మూలం. బలం పెరిగినప్పుడే భయం ఎక్కువ. ఆశీర్వచనం ఆత్మశక్తికి అనుపానం.

విక్ర: మహాప్రసాదం! జోస్యులవారూ, నిన్న రాత్రి చాలా పీడకలగన్నాను. అందు నిమిత్తమే మీకోసం అంపించాను.

క్షుంపా : భేతాళసిద్ధిపొంది, తాంత్రిక విద్యపాదులెరిగిన మహారాజుకి స్వప్నఫలం నేను చెప్పాలా ? గోష్ఠి మీ విలాసం కానియ్యండి.

విక్ర : కలలో సర్పంకనబడొచ్చా ?

క్షుంపా : కనపడ్డ విధానాన్నిబట్టి ఫలాఫలాలుచెప్పడం మహరాజుకి తెలియనివిషయంకాదు. కరిచినట్టుందా ?

విక్ర : లేదు. పెద్దసర్పం, వెయ్యిపడగల పాము. బుస్సలు కొడుతూవొచ్చించి. ఆ సర్పంనోట్లోంచి, వోశిశువు పైకొచ్చింది. చూస్తోండగా పెద్దదై భూమ్యాకాశాలు ఆక్రమించుకుంది. ఆ మహాతేజస్సులో నా కళ్లుమూసుకు పోయాయి. ఇంతట్లో మెళుకువవొచ్చింది.

క్షుంపా : లేచే సరికి సూర్యోదయం అయిందా ?

విక్ర : సూర్యరశ్మి నా కళ్లలోపొడిచి విభ్రాంతి పొందానని మీ వ్యాఖ్యానమా ?

క్షుంపా: మనవిజేస్తాను. నిన్న నే బ్రహ్మగుప్తులవారితో గ్రహచారం విషయం సంభాషించాను. శనిప్రాబల్యం వున్న వో విపరీత గ్రహకూటం జరిగే యుగసంధిలో వున్నాం మనం. రెండువేల నూట ఇరవైమూడు సంవత్సరాలకోసారిగాని ఈ విధమైన గ్రహకూటం సంభవించదు. ఖగోళచారం భూగోళస్థితిలో మంచి చెడ్డలకి ఆధారమన్న సంగతి మహారాజులికి విదితమే.

విక్ర : మహాత్మా, మాటకడ్డంవొచ్చాను. క్షమించండి. నా స్వప్నానికీ, ఈ ఖగోళాలకీ సంబంధం వుండం టూరా ?

క్షుంపా : మహారాజ స్వప్నాలు రాజ్యానికి మేలుకీళ్లు సూచిస్తాయి. మహారాజ పత్ని మాయాదేవి సుస్వప్నం బుద్ధావతారానికి శుభసూచనగా పరిణమించింది. మహారాజు విక్రమాదిత్యుడి స్వప్నంకూడా మరో అవతార సూచన కాకూడదా ?

విక్ర : మంచికా, చెడ్డకా ?

క్షుంపా: మంచి చెడ్డలు సంఘానికి అనువర్తించేవేగాని, వ్యక్తుల కష్టసుఖాలు గణన లోకిరావు.

విక్ర : మహానుభావా, నాస్వప్న శంకతీర్చి నన్ను మన్నించరా ?

క్షుంపా : మహారాజా ! సర్పజాతికి వంచన జరిగింది. ఆది శేషువుకి అపరాధంజరిగింది. ఉజ్జయనీ నగరం విడిచి మహారాజు విజయ యాత్ర సాగించిన దేశం నాగదేశం. నాగు లీవరకు సర్వస్వతంత్రులు. మహారాజుకి సామంతులు కాకుంటున్నారు. తమ కులదేవత ఆదిశేషువుతో మొరబెట్టుకున్నారు. ఆ మొర ఆ ఆదిశేషువు ఆలకించాడు. భూమీ భారంభరించే ఆ ఆదిశేషువు ఈ నాగులికి అభయం ఇచ్చాడు. గోదావరీ ప్రాంతం ఆది శేషువుకి ఆదరప్రాయం అయింది. త్రేతాయుగంలో లక్ష్మణస్వామిగా, అవతరించినప్పుడు పధ్నాలుగు సంవత్సరాలు ఈ ప్రాంతంలోనే బ్రహ్మచర్యంపాలించి, శ్రీ సీతారాముల్ని సేవించాడు. అటువంటి ఆదిశేషువుకి అపరాధం జరిగింది. భూలోకంలో మళ్లీ జన్మించి అపరాధిని శిక్షించదల్చుకున్నాడా అనిపిస్తుంది. ఆ అవతారం జన్మించి, పెరిగి, నీతో సంధించేవరకూ, మహారాజుకి కీడురాకూడదు. అంతకుమించి బుద్ధిపారడంలేదు, విక్రమసింహా !

విక్ర : అయితే మనకి శత్రువు జన్మిస్తాడా ?

క్షుంపా: జన్మిస్తాడో, జన్మించివున్నాడో చెప్పడం దుర్లభం. పరమేశ్వర సంకల్పం ముందుగా తెలిస్తే, విశ్వకల్యాణానికి లోపంకలిగే పక్షంలో, ఆ సంకల్పరహస్యం జ్యోతిష దృష్టికి అందదు మహారాజా.

విక్ర: నాపరిపాలనలో విశ్వశ్రేయస్సుకి ఏంలోపం జరిగింది?

మంత్రి : జరిగిందని సిద్ధాతులు సూచించలేదు మహారాజా.



http://www.maganti.org/

విక్ర : అక్షరాలాచెప్పాలా? నన్ను పరిమార్చడానికి ఎవరో దేవుడో దెయ్యమో పుడతాడంటే చాలదా ?

క్షుంపా: జ్యోతిష శాస్త్రానికి పార్వతీదేవి శాపంవున్న సంగతి నీకు తెలియని సంగతికాదు. నిజానిజాలు దైవాధీనాలు. నేచెప్పిన ఫలం విఫలం కావాలనే నా అభీష్టం, మహారాజా.

విక్ర : తప్పోగిప్పో, వీర విక్రమాదిత్యుని కంఠంలో ప్రాణం వున్నంతవరకు, ఆదిశేషువుకాదు, ఆదిశక్తికూడా...

మంత్రి: మహారాజా, మిట్ట మధ్యాహ్నం అయింది. డేరాలకు.

విక్ర : మహామంత్రీ, ఈ ఘడియ మొదలు, నాగదేశంలో ఏ కొత్త శిశువు జన్మించినా, ఎక్కడదాక్కున్నా సప్తసముద్రాలుగాలించి నాయెదుట పెట్టవలసిందే. తెలిసిందా ?.....(ఉరుములు చప్పుడు).....ఏమిటది ? ఆయోధుడెవరు అశ్వారోహణ చేస్తున్నాడు. తెల్లటి గుర్రం వాడిచేతులో ఏమిటి, కుమ్మరి సారె. గిర్రున తిప్పుతున్నాడు.

(శాలివాహనుడు మట్టిగుర్రంమీద ఎక్కి కూచుంటాడు. చేతులో చక్రం.)

మంత్రి : మహారాజా కుర్రవాడు ఆడుకుంటున్నాడు. మట్టి గుర్రంమీద ఎక్కి ఎగుర్తున్నాడు. బడలికచేత మహారాజులికి మతి భ్రమణంకలుగుతోంది.

విక్ర : కళ్ల ఎదుట ప్రత్యక్షంగా కనబడుతోంటే మతి భ్రమణం అంటావేమిటి మంత్రీ.

శాలి : గిర్రున తిరిగే చక్రం
గిరగిర తిరిగే చక్రం
అరవయ్యాకుల చక్రం
శాలీవాహన చక్రం

విక్ర : అదుగో ఇల్లాగేవొస్తున్నాడు. ఎవడురా అక్కడా, రాజాశ్వాన్ని, అస్త్రాలు సిద్ధంచెయ్యండి.

మంత్రి : మహారాజా, శాంతించాలి, కాస్తవిశ్రాంతి తీసుకుంటే శిరోష్ణత తగ్గుతుంది.

క్షుంపా : (రహస్యంగా) రాజవైద్యులు ధన్వంతరికి కబురు పంపుదామా ?

విక్ర : ఏమిటీ, వైద్యులా, నాకు పిచ్చెక్కిందనుకుంటున్నారా ?

[పొరలో బాణంతీసి శాలివాహనుని మట్టి గుర్రంమీద వేస్తాడు.]

క్షుంపా : శ్రుతిమించి రాగాన బడింది.

శాలి : అరేయ్ ఎవడ్రానువ్వు. శాలివాహన చక్రవర్తి తెల్లగుర్రం మీద బాణంవేస్తావూ ? ఏవమ్మా గుర్రం దెబ్బతగిలిందా ? పొట్టనెప్పెడుతోందా ? అమ్మతో చెబుదామేం. వాణ్ణికొట్టిద్దాం. అమ్మా గోదావరీ చూడవే ఈ అబ్బి ఎవరో నా గుర్రంమీద బాణం వేశాడు.

విక్ర : అబ్బినిట్రా కుర్రకుంకా! వీరవిక్రమాదిత్యుడు అబ్బిలా వున్నాడా ?

శాలి : మీదమీదికొస్తున్నావు జాగర్త.

విక్ర : ఎవడ్రా అక్కడ ఈ కుర్రకుంకని కాళ్లూచేతులూ కట్టెయ్యండి.

శాలి : వొస్తున్నారా, కాసుకోండి నా భటుల్ని మీ మీదికి తరుముతాను. (మట్టిబొమ్మలు ఒకదాని తర్వాత ఒకటివాళ్లమీదికి విసుర్తాడు.)

మంత్రి : ఏమిటీ ఆశ్చర్యం. కుర్రవాడు గిరవటేసిన మట్టి బొమ్మలు ప్రాణాల్తో లేచొస్తున్నాయి.

క్షుంపా : అదుగో మన భటుల్తో కలియబడుతున్నాయి.

విక్ర : జై! భేతాళా! (ఒక్క గంతులో వెళ్లిపోతాడు).

శాలి : జై! గోదావరీ! (ఛెంగుని ఎగిరి వెళ్లిపోతాడు).

మంత్రి : మన సైనికులొస్తున్నారు.

క్షుంపా : అటునించీ వొస్తున్నారు.

(జన జమ్మర్దపు ధ్వని).

మంత్రి : మహారాజు కుర్రవాడిమీదికి వురుకుతున్నాడు.

క్షుంపా : కుర్రవాడి మట్టి గుర్రం పరుగెత్తుతోంది.

మంత్రి : రాజు అస్త్రం సంధిస్తున్నాడు.

క్షుంపా : కుర్రవాడు చక్రం తిప్పుతున్నాడు.

(రణగొణ ధ్వని)

మంత్రి : మన సైన్యాలు ఇటునించి వొస్తున్నాయి.

(నీళ్లు పొంగి వరదలొచ్చిన ధ్వని)



http://www.maganti.org/

మంత్రి : అదేమిటి గోదావరి వుప్పొంగి, గట్లకి తాసుకు పారుతోంది.

కుంపా : సూర్యుడిమీద నల్లమేఘం నిల్చింది.

మంత్రి : అదేమిటి నదిలోంచి ఆ సుందరి ఎవరు.

కుంపా : గోదావరీ, మహా తల్లీ నమస్కారం. మంత్రి పుంగవా, మనం ధన్యాత్ములం. గంగా భవాని మనకి ప్రత్యక్షం అయింది. యుగసంధిలో, ఈ మహా సంఘటన, దేవి ప్రత్యక్షంగా తిలకిస్తోంది. కాల పరిణామం కళ్లారా చూసిన మనకి పునర్జన్మ లేదు.

మంత్రి : మహారాజూ కుర్రవాడూ ఘోరయుద్ధం చేస్తున్నారు.

కుంపా : మన సైన్యాలు పారిపోతున్నాయి.

మంత్రి : మహారాజు గుర్రంమించి పడిపోయాడు.

(బ్రహ్మాండమైన కోలాహలం)

కుంపా : ఏమిటూ బాలుడి మహా పరాక్రమం. మధ్యందిన మార్తాండుణ్ణి మించి, దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. మహా తేజస్సుతో మహారాజు సైన్యాలను చెండాడుతున్నారు. (లోపలినుంచి)

విక్ర : జయ్ ! భేతాళా !

శాలి : జయ్ ! గోదావరీ !

గోదావరి : నాయనా, విజయాభవ. ఆదిశేషువు కృపవల్ల నా గర్భాన్ని జన్మించి, ప్రతిష్ఠానపురంలో కుమ్మరి యింట పెరిగిన నువ్వు, విక్రమార్కుణ్ణి గెల్చి, వింధ్యాసేతుపర్యంతం నూతన శకారంభం చెయ్యి నాయనా.

నీ అమ్మకడుపు చల్లగా, నీ ప్రజలు చల్లగా, నూరేళ్లు వెయ్యేళ్లు వర్ధిల్లు నా తండ్రీ. నీ వంశం శాశ్వతం. మహిషా సురమర్దని నీ మారుతల్లి. నీకూ, నీ ప్రజలకీ శ్రీ రామరక్ష !

(మామిడి చెట్టుమీద కోకిల మళ్లీ కూస్తుంది).

★

# చిత్రసమాచార్

"స్వర్గసీమ" సౌండ్ పిక్చర్ రేడియోలో విన్నప్పణ్ణించి ఎప్పుడుచూద్దామా చిత్రం అని అనేకులు ఉబలాటపడుతున్నారు. జయమ్మ అమృత మధురగానం, భానుమతి తళుకుబెళుకులతో తటిల్లతలా మెరవడం. నాగయ్యా, నారాయణరావుల నటనావైదుష్యం, ఎప్పుడో కాదు ఈ నెల 26వ తేదినుంచే చూడవచ్చు.

* * *

చమ్రియా టాకీ డిస్ట్రిబ్యూటర్సువారు రాజరాజేశ్వరివారి "పాదుక"కు అరున్నొక్కటి తెలుగు కేంద్రాల్లో పట్టాభిషేకోత్సవం జరిపించి విశేషంగా కట్నాలందుకుంటున్నారు.

* * *

"మాలపిల్ల" చిత్రంతో చిత్రనిర్మాతల్లో విశిష్టస్థానం పొందిన గూడవల్లి రామబ్రహ్మంగారు 'మాయలోకం' అనే కాంభోజరాజు చిత్రాన్ని చాలామట్టుకు పూర్తి చేశారు.

* * *

త్యాగయ్య అజరామరంగా రచించిన గేయాలతో నాగయ్య త్యాగయ్యగా వెండితెరమీద వేసవిదాటకుండానే సాక్షాత్కరిస్తానంటున్నాడు.

* * *

మదరాసు స్టుడియోలలో పనితేలదని ఫేమస్ సినీస్టార్ కంబైన్స్‌వారు కొల్హాపూర్ ప్రభాకర్ స్టుడియోలో 'మాయామచ్ఛీంద్ర' రాత్రిపగలు వివక్షతలేకుండా పూర్తి చేస్తున్నారు.

* * *

ఆదికవి వాల్మీకి జీవితంతో చిత్రకళా దేవతను అలంకరించదలచుకొన్న బామ్మా ఫిలింస్‌వారు చిత్రాన్ని చాలా మట్టుకు పూర్తిచేశారు.

* * *

కమలాకోట్నీస్ ప్రభాత్‌వారి చిత్రంలో నటిస్తున్నదట

* * *

ఈస్టర్న్ పిక్చర్ (మదరాసు) వారు బొంబాయి టాకీస్ వారి 'జ్వార్-భాటా' చిత్రం మదరాసు స్టార్ టాకీస్‌లో 30-3-45 న విడుదలచేశారు. చిత్రం బాగుంది.

http://www.maganti.org/

Source: A.P. Press Academy Website, Andhra Mahila Magazine - 1945

Disclaimer: This topic/article/write-up of Sri Kapila Kasipathi has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan